



పుష్కరిణిలో చక్రత్తాళారును మునక వేయించిన అర్చకులు, టీటీడీ ఈవో, అదనపు ఈవో తదితరులు - ఆలయంలో గరుడపటాన్ని కిందకు దించుతున్న అర్చకులు



పుష్కరిణి చుట్టూ ఉన్న భక్తులు

బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

● శనివారం ఉదయం చక్రస్నానం.. రాత్రి ధ్వజావరోహణం

తిరుమల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి జరిగిన చివరి ఘట్టమైన ధ్వజావరోహణంతో పరిసమాప్తమయ్యాయి. ఉత్సవాల మొదటిరోజు ధ్వజారోహణం సందర్భంగా గరుడాళ్వార్ ఆహ్వానించిన దేవతలను తిరిగి పంపే కార్యక్రమాన్నే ధ్వజావరోహణం అంటారు. ఈ సందర్భంలోనే తిరిగి వచ్చే బ్రహ్మోత్సవాలకు రావాలని గరుడాళ్వార్ దేవతలను కోరతారని పురాణోక్తి. చివరి రోజైన శనివారం సాయంత్రం ఏడు గంటలకు ఉభయ దేవేరుల సమేతంగా స్వామివారిని బంగారు తిరుచ్చిలో తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం ధ్వజస్తంభం వద్దకు వేంచేపుచేశారు. రాత్రి 9 గంటలకు అర్చకస్వాములు పూజాధికార్యక్రమాలు నిర్వహించి ధ్వజస్తంభంపై ఉన్న గరుడ పటాన్ని శాస్త్రోక్తంగా కిందకు దించారు. అనంతరం ధ్వజపడి నివేదన కావించి, ఆలయంలోని బంగారువాకిలిలో ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించారు.

వేడుకగా చక్రస్నానం

శనివారం ఉదయం ఆలయం నుంచి ఉత్సవర్లను తిరుచ్చిలో, చక్రత్తాళ్వార్‌ను పల్లకీలో తిరుమాడ వీధుల్లో ఊరేగింపుగా వరాహస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం, ఇత్యాది కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తరువాత చక్రత్తాళ్వార్‌ను అర్చకస్వాములు పుష్కరిణిలో మూడుమునకలు వేయించారు. పుష్కరిణిలో అప్పటికే వేచివున్న వేలాదిమంది భక్తులు గోవింద నామస్మరణలతో స్నానమాచరించారు. అనంతరం ఉత్సవర్లను పల్లకీలో ఆలయం ఆలయానికి వేంచేపు చేశారు. పుష్కరిణి సామర్థ్యం తక్కువగా ఉండే నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో భక్తులను విడదల వారీగా లోపలకు అనుమతించారు. దీంతో ఎలాంటి తోపులాటలు, తొక్కిసలాటలు చోటుచేసుకోలేదు. పుష్కరిణి చుట్టూ పోలీసు, భద్రతా, ఇతర బలగాలతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టడంతో చక్రస్నానం సాఫీగా సాగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జ్యోతిర్మయి, రవినాథ్‌తిల్హరి, నందమూరి వసుంధరదేవి, జన సేన పార్టీ నేత పసుపులేటి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



చక్రస్నానం సందర్భంగా పుష్కరిణిలోకి వస్తున్న భక్తులు

సమష్టి కృషితో విజయవంతం

అధికారులంతా కొత్తయినా.. ప్రణాళికాబద్ధంగా నిర్వహణ

తిరుమల, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంతరాలు, అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో సలక సౌకర్యాలతో భక్తులను వాహనసేవలను కనులారా తిలకించారు. అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో తొమ్మిదిరోజుల ఉత్సవాలు విజయవంతంగా సాగాయి. ఈనెల 4వ తేదీన మొదలైన బ్రహ్మోత్సవాల్లో సీఎం చంద్రబాబు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రూ.13.45 కోట్లతో నిర్మించిన వకుళామాత సెంట్రల్ కిచెన్‌ను మరునటి రోజు ప్రారంభించారు. ఇక, ఉత్సవాల్లో తొలి నాలుగు రోజులు భక్తుల రద్దీ సాధారణంగా ఉన్నా.. ఐదవ రోజు గరుడ సేవకు దాదాపు ఐదేళ్ల తర్వాత విపరీత రద్దీ కనిపించింది. రాఘవేంద్రస్వామి మఠానికి సమీపంలోని అదనపు క్యూలైన్ల ప్రవేశంలో గంట పాటు భక్తుల మధ్య తోపులాటలు మినహా.. అంతా ప్రశాంతంగా ముగిసింది. జేఈవో వీరబ్రహ్మం మినహా ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, సీవీఎస్వో శ్రీధర్ బ్రహ్మోత్సవాలకు కొత్తే అయినప్పటికీ.. ముందస్తు ప్రణాళిక, సమష్టి కృషితో మంచి ఏర్పాట్లు చేసి సక్సెస్ అయ్యారు. ఈ ఏడాది కళాబృందాల ప్రదర్శనలు చాలా సాధారణంగా జరిగాయి. పెద్దగా మెప్పించలేకపోయారనే భావన వ్యక్తమైంది. దీంతో వచ్చే బ్రహ్మోత్సవాలకు ఉత్సాహవంతులు.. వివిధ రాష్ట్రాలకు చెందిన గ్రామీణ, ప్రముఖ కళాబృందాలను తీసుకురావాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఎప్పటిలానే ఈసారి కూడా విద్యుత్, పుష్పాలంకరణలు భక్తులను మెప్పించాయి. మరోవైపు ఈసారి పోలీసుల బందోబస్తు భారీగా కనిపించింది.

కనిపించని వీఐపీల హడావుడి

ఈసారి ఉత్సవాల్లో వీఐపీల హడావుడి లేకుండా వాహనసేవలు ప్రశాంతంగా జరిగాయి. సీఎం పర్యటనలోనూ పెద్దగా రాజకీయ ప్రముఖులు కనిపించలేదు. తొమ్మిదిరోజుల్లో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు బీవీఎల్ఎన్ చక్రవర్తి, గోపాలకృష్ణారావు, రవినాథ్ తిల్హరి, జ్యోతిర్మయి, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి దుప్పల వెంకటరమణ, కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, తెలంగాణ పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, నందమూరి వసుంధరాదేవి మాత్రమే వాహనసేవల్లో పాల్గొన్నారు.

ఈ'సారీ' మరుగుదొడ్ల సమస్య

ముందస్తు ప్రణాళికతో ఎన్ని ఏర్పాట్లు చేసినా.. ఈసారి కూడా మాడవీధుల్లో మరుగుదొడ్ల విషయంలో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తాయి. సరిపడా మరుగుదొడ్లు లేకపోవడం, విరిగిపోయిన పైపులు, నీటి కొరత, దుర్వాసనతో గరుడసేవ రోజున భక్తులు ఇబ్బంది పడ్డారు. వీటిని గుర్తించిన అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా యోచిస్తున్నారు. గ్యాలరీల విస్తరణపైనా దృష్టిపెట్టారు.

నేటి నుంచి భారీ వర్షాలు

- మత్స్యకారులూ చేపలవేటకు వెళ్లొద్దు
- వాటర్‌ఫాల్స్, బీచ్‌లోకి నో ఎంట్రీ
- ఇబ్బందులుంటే 0877-2236007 నెంబరుకు ఫోనుచేయాలన్న కలెక్టర్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 13: 'బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గ్రామస్థాయి నుంచి జిల్లా అధికారుల వరకు అప్రమత్తంగా ఉండాలి. ఆస్తినష్టం, ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి' అని జిల్లా యంత్రాంగానికి కలెక్టరు వెంకటేశ్వర్ సూచించారు. ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి ఆదివారం ఆయన కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. మత్స్యకారులు వేట కోసం సముద్రంలోకి వెళ్లి ఉంటే సత్వరమే వెనక్కి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మూడు రోజులపాటు సముద్రంలోకి చేపలవేటకు మత్స్యకారులు వెళ్లరాదని దండోరా వేయించాలన్నారు. తీర ప్రాంతాలైన గూడూరు, చిల్లకూరు, వాకాడు, కోట, సూళ్ళూరుపేట, తడ తదితర మండలాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఏ సమయంలోనైనా 0877-2236007 నెంబరుకు ఫోను చేసి సమాచారం ఇవ్వొచ్చని ప్రజలకు సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి.. పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సెలవుల్లో ఉన్న వారు వెంటనే విధుల్లో చేరాలన్నారు. తిరుపతి నగరంలోనూ మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నాలుగు రోజులపాటు జలపాతాలు, బీచ్‌లకు పర్యాటకులకు అనుమతి లేదని స్పష్టంచేశారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఇక, గూడూరు సబ్‌కలెక్టరు రాఘవేంద్రమీన ఆదివారం తీరప్రాంతాల్లో పర్యటించారు. పొర్లుకట్టలను పరిశీలించారు. అధికారులను, ప్రజలను అప్రమత్తం చేశారు. కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్‌ను సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి పరిశీలించారు.



కోట మండలం పుచ్చలపల్లిలో స్వర్ణముఖినది పొర్లుకట్టలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన

కలెక్టరేట్‌లో నేటి పీజీఆర్ఎస్ రద్దు

భారీ వర్ష సూచన నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి ఎవరూ కలెక్టరేట్‌కు రావద్దని కోరారు. డివిజన్, మండల ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలనూ రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

తలకోనకు రావొద్దు

ఎర్రావారిపాలెం: తుపానుపై వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పర్యాటక కేంద్రమైన తలకోనకు ఎవరూ రావొద్దని ఎస్ఐ ఎర్రిస్వామి కోరారు. నాలుగు రోజులపాటు పర్యాటకులకు అనుమతి నిలిపివేసినట్లు చెప్పారు. తలకోన జలపాతంతో పాటు మాకలరేవు, ధనువు తీసిన బండ ప్రాంతాలకు ఎవరూ వెళ్లరాదన్నారు. పర్యాటకులు, శివ భక్తులెవరు తమ తలకోన పర్యటనను వాయిదా వేసుకోవాలని కోరారు. ఒకవేళ వచ్చినా తలకోన మొదటి వంక వద్దే నిలిపేస్తామన్నారు.

ఎస్వీ వైద్య కళాశాలలో డిప్లొమా కోర్సులకు నేడు కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 13 : ఎస్వీ వైద్య కళాశాలలో డిప్లమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ పారా మెడికల్ కోర్సుల్లో మిగిలిన ఒక్క సీటుకు సోమవారం కౌన్సెలింగ్, స్పాట్ అడ్మిషన్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితా ప్రకారం గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు. ఉదయం 10.30 గంటలకు కళాశాలలోని కార్యాలయానికి హాజరుకాగలరని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 94408 79943కు సంప్రదించాలని తెలిపారు.

ఆర్టీసీకి బ్రహ్మోత్సవాల రాబడి రూ.8.7కోట్లు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 13: శ్రీవారి బ్రహ్మోత్సవాల తొమ్మిది రోజుల్లో ఆర్టీసీ బస్సుల ద్వారా 10,77,273 మంది తిరుమలకు రాకపోకలు సాగించారు. 404 బస్సులు తిరుపతి నుంచి తిరుమలకు 17,233 ట్రిప్పులతో 4,71,914మంది, తిరుమల నుంచి తిరుపతికి 17,295 ట్రిప్పులలో 6,05,359మంది ప్రయాణించారు. 31 ఆక్యుపెన్సీ రేషియోతో రికార్డు స్థాయిలో రూ.8.7కోట్లు సమకూరినట్లు ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు.

హైదరాబాదు, బెంగళూరుకు అదనపు బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 13: దసరా సెలవులు ముగిసిన నేపథ్యంలో ఆర్టీసీ హైదరాబాదు, బెంగళూరులకు 29 అదనపు సర్వీసులు ఏర్పాటు చేసింది. బెంగళూరుకు 23 (8సూపర్ లగ్జరీలు, 2 అల్ట్రా డీలెక్స్‌లు, 12 ఎక్స్‌ప్రెస్‌లు) బస్సులు కేటాయించింది. ఇవి సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకు వివిధ సమయాలలో బయలుదేరి వెళ్లాయి. హైదరాబాదుకు 6 (అమరావతి 1, సూపర్‌లగ్జరీలు 2, అల్ట్రా డీలెక్స్‌లు 3) బస్సులు కేటాయించగా సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.30మధ్య పయనమయ్యాయి. సాధారణ ఛార్జీలనే వసూలు చేయగా పూర్తి ఆక్యుపెన్సీ రేషియో నడిచాయి. సోమవారం రద్దీని అనుసరించి అదనపు సర్వీసులు నడపనున్నట్లు బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు తెలిపారు.

'లక్కు' ఎవరికో?

- నేడు లాటరీ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు
- తిరుపతి శిల్పారామం వేదిక
- ఉదయం 7 గంటలకంతా ఎంట్రీ పాసులతో రావాలన్న ఈఎస్



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 13: జిల్లాలో మద్యం 227 మద్యం దుకాణాలకు 3915 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎవరిని 'లక్కు' వరించనుందో నేడు తేలిపోనుంది. తిరుపతి శిల్పారామంలోని ఏసీ హాలులో సోమవారం ఉదయం 8 గంటల నుంచి కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా డిప్ తీసి మద్యం దుకాణాలను కేటాయించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎక్సైజ్ సూపరిటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు. శిల్పారామం హాలు నెంబరు 1లో తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, శ్రీకాళహస్తి, పుత్తూరు, నాగలాపురం, చంద్రగిరి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని మద్యం దుకాణాలకు సంబంధించి లాటరీ తీయనున్నారు. హాలు నెంబరు 2లో గూడూరు డివిజన్‌కు సంబంధించి గూడూరు, నాయుడుపేట, సూళ్ళూరుపేట, వాకాడు, వెంకటగిరి ఎక్సైజ్ స్టేషన్లకు సంబంధించి మద్యం దుకాణాలకు లాటరీ తీస్తారు. దీనికిగాను దరఖాస్తుదారులు ఉదయం 7 గంటలకంతా శిల్పారామం వద్దకు చేరుకోవాలి. ఎంట్రీ పాసు, ఐడెంటిటీ ప్రూఫ్ కార్డులు తీసుకురావాలి. ఒకవేళ అభ్యర్థులు రాలేకుంటే.. వారి తరపున హాజరయ్యే వారి ధృవీకరణ పత్రం, ఐడెంటిటీ కార్డు, ఎంట్రీ పాసుతో హాజరుకావాలి. లాటరీ ద్వారా దుకాణాలు పొందిన వారు లైసెన్సు ఫీజు మొదటి కంతును శిల్పారామంలో ఏర్పాటు చేసిన బ్యాంకు కౌంటర్లలో చెల్లించి లైసెన్సు పొందాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. శిల్పారామం వద్ద అదనపు ఎస్పీలు, ఐదుగురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, దాదాపు 300 మంది పోలీసులు, ఎస్టీఎఫ్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎవరైనా గలాటాలు చేయాలని ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు.

'మందు' బాదుడు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 13: ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని కొందరు సిబ్బంది మందుబాబులను బాదేస్తున్నారు. మంగళవారంతో ఈ దుకాణాలు మూతపడి.. బుధవారం నుంచి ప్రైవేటు మద్యం షాపులు రానున్నాయి. దీంతో వీరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. క్వార్టర్ బాటిల్‌పై రూ.15 నుంచి రూ.20 వరకు పెంచి అమ్ముతున్నారు. పలుచోట్ల మందుబాబులు ఆందోళనకు కూడా దిగారు. ఎలాగూ 15వ తేదితో తమ ఉద్యోగాలు పోతున్నాయన్న క్రమంలో చాలా చోట్ల పది రోజులుగా మద్యం కొరతను సృష్టించి రేటు పెంచి అమ్ముతున్నారు. కొందరైతే పోయే ఉద్యోగం ఉంటే ఎంత..పోతే ఎంత అనుకుని మద్యం నిల్వలను బెల్టు షాపులకు తరలించారు. ఈ విషయమై ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళగా టాస్క్‌ఫోర్సు స్క్వాడ్‌ను పంపి కేసులు నమోదు చేస్తామని చెప్పారంతే. మద్యం బాదుడు మాత్రం ఆగలేదు.

అ'పూర్వ' సమ్మేళనం



తిరుపతి అర్బన్, అక్టోబరు 13: ఎర్రావారిపాళెం మండలం నెరబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-97మధ్య చదువుకున్న విద్యార్థుల 27 వసంతాల ఆత్మీయ సమ్మేళన వేడుక ఆదివారం కోలాహలంగా జరిగింది. లీలామహల్ సర్కిల్లోని సాయిాస్ ఎంజీఎం గార్డెన్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఒకరినొకరు పలకరించుకుంటూ యోగక్షేమాలను తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు తాతిరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌శర్మ, చంద్రబాబులను ఘనంగా సన్మానించారు. అంతకముందు చిన్నారి వకుళ కూచిపూడి నృత్యప్రదర్శన ముచ్చటగొలిపింది. పాఠశాలకు అవసరమైన సామగ్రి అందించేందుకు ముందుకొచ్చారు. పూర్వ విద్యార్థులు, టీచర్లు రమేష్, విజేత, డాక్టర్లు స్వర్ణలత, రమేష్, నూరుల్లా, బ్రహ్మయ్య, చలపతి, చెన్నకేశవులు, సతీష్, రమణ, విశ్వనాథ్‌రెడ్డి, అరుణ, రాజేశ్వరి, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం



ప్రభుత్వ భూమిని చదును చేసిన దృశ్యం

తిరుపతి రూరల్, అక్టోబరు 13 : రామానుజపల్లె సర్వే నంబరు 121/5లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నం చేశారు. గ్రామంలో నుంచి సి.గొల్లపల్లెకు వెళ్లే మార్గంలోని భూమిని ఎక్సవేటర్‌తో చదును చేశారు. ఇందులో 1.29 ఎకరాలు రెవెన్యూ రికార్డుల్లో బండి బాటగా నమోదై ఉంది. విలువైన ఈ భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శిల్పారామం వద్ద ట్యాక్సీ స్టాండ్ ప్రారంభం



తిరుచానూరు, అక్టోబరు 13 : తిరుచానూరు రోడ్డులోని శిల్పారామం వద్ద ఆదివారం శ్రీపద్మావతి ట్యాక్సీ స్టాండ్‌ను ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ ఆదివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదని, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఎన్‌డీ రవి, ట్యాక్సీ యూనియన్ నాయకులు రహంతుల్లా, బాలు, వంశీ, శివ, సురేష్ పాల్గొన్నారు.

జీవలింగేశ్వరస్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలు




తిరుపతి (జీవకోన), అక్టోబరు 13: నగర పరిధిలోని జీవలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణ-ద్రౌపది సమేత ధర్మరాజులస్వామి 20వ వార్షిక మహాభారత ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ఆచారాలు నానాటికి తగ్గిపోతున్న నేపథ్యంలో వీటిని నగర వాసులకు చేరువ చేయాలన్న ప్రధాన ఉద్దేశంతో ఆలయంలో ఏటా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన గీతావణి హరికథా గానం అలరించింది. ఈనెల 27వ తేదీ వరకు రాత్రి తొమ్మిది గంటలకు శ్రీవెంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో వివిధ నాటక ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు అన్నా రామచంద్రయ్య, అన్నా రామకృష్ణ, అన్నా మల్లీశ్వరి తెలిపారు. 27న దుర్యోధన వధ, అగ్నిగుండ ప్రవేశంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. అదే రోజు రాత్రి శ్రీరామాంజనేయుద్ధం పద్య నాటకం ఉంటుందని వెల్లడించారు. నగర వాసులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శాప్ ఛైర్మన్‌కు సన్మానం



రవినాయుడిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

చంద్రగిరి, అక్టోబరు 13: శాప్ ఛైర్మన్ రవినాయుడిని ఆదివారం చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ నాయకులు సన్మానించారు. విజయ దశమి పురస్కరించుకుని టీడీపీ నేత రూపేష్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కుంట్రపాకం రమేష్, గౌరిశంకర్, కోటి, దొరస్వామినాయుడు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మూలస్థాన ఎల్లమ్మకు పట్టువస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న పులివర్తి సుధారెడ్డి

చంద్రగిరి, అక్టోబరు 13: చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మకు శనివారం రాత్రి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న ఆమెకు ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పుష్పపల్లకి వాహన సేవలో పాల్గొన్నారు. అనంతరం పలు ఆలయాలను సందర్శించారు.

చంద్రగిరి

అందరూ అందుబాటులో ఉండాలి



రామచంద్రాపురం, అక్టోబరు 13: తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండల స్థాయి అధికారులు అందుబాటులో ఉండాలని తహసీల్దారు వెంకటరమణ కోరారు. రెవెన్యూ కార్యాలయంలో ఆదివారం మండల స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ అధికారులెవరూ సెలవులు తీసుకోరాదన్నారు. సోమవారం ఫిర్యాదుల పరిష్కార దినాన్ని రద్దు చేశామన్నారు. అనంతరం రాయలచెరువు కట్ట స్థితిగతులను పరిశీలించారు. ఎంపీడీవో ఇందిర, డీటీ అన్వర్‌బాషా, ఎస్ఐ రామాంజనేయులు, ఏఈ పవన్‌కుమార్‌రాజు పాల్గొన్నారు.




పొగడ చెట్టు వద్ద పూజలు - మలయప్పస్వామి ఊరేగింపు

వైభవంగా 'భాగ్ సవారి'

తిరుమల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం 'భాగ్ సవారి' ఉత్సవం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల మరుసటి రోజు ఈఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. పురాణాల ప్రకారం.. స్వామి భక్తుడైన అనంతాళ్వారు భక్తిని పరీక్షించడానికి శ్రీదేవి సమేతంగా స్వామివారు అనంతాళ్వారు పూదోటకు మానవ రూపంలో వెళతారు. తన పూదోటలో పూలు కోస్తున్న అమ్మవారిని అనంతాళ్వారు అశ్వత్థ వృక్షానికి (పొగడ చెట్టు) బంధిస్తాడు. స్వామిని పట్టుకోబోగా అప్రదక్షిణ దిశలో ఆలయంలోకి పారిపోయి మాయమైపోతారు. తన భక్తిని పరీక్షించడానికి వచ్చింది స్వామివారేనని అనంతాళ్వారు గ్రహించి పశ్చాత్తాపపడతాడు. వెంటనే అమ్మవారిని బందీ నుంచి విముక్తురాలిని చేసి, పూల బుట్టలో కూర్చోబెట్టి స్వామి చెంతకు చేరుస్తారు. అతడి కోరిక మేరకు బ్రహ్మోత్సవాల మరుసటి రోజు అనంతాళ్వారు తోటకు అప్రదక్షణగా వచ్చి తిరిగి ఆలయంలోకి ప్రవేశిస్తానని స్వామివారు అభయమిచ్చారు. అందులో భాగంగా నిర్వహించే భాగ్‌సవారి ఉత్సవం కోసం ఆదివారం సాయంత్రం 4 గంటలకు వైభవోత్సవ మండపం నుంచి స్వామివారు బయలుదేరి అప్రదక్షిణంగా అనంతాళ్వారు తోటకు చేరి అక్కడ ప్రత్యేక పూజలు అందుకున్నారు. అంతకుముందు అనంతాళ్వారు వంశీకులు నాళాయరా దివ్య ప్రబంధం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీయర్‌స్వాములు, అదనపుఈవో వెంకయ్య చౌదరి, పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదారు హిమత్‌గిరి, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపట్టులో అపచారం

- గ్రామదేవత విగ్రహం చేతులు విరిచేసిన నిందితుడు
- ప్రభుత్వ టీచరుపై గ్రామస్తుల ఫిర్యాదు

తిరుచానూరు, అక్టోబరు 13: తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టులో గ్రామదేవత ఎల్లమ్మ విగ్రహం చేతులను విరగ్గొట్టారు. మరో విగ్రహాన్ని పెకలించారు. శనివారం వేకువజామున జరిగిన ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు ప్రభుత టీచరుపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బ్రాహ్మణపట్టులో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎల్లమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని పాతూరు, దిగువూరు, బ్రాహ్మణపట్టులో రోజూ ఊరేగించారు. ఊరేగింపు ముగిశాక ఆలయంలో ఉంచుతారు. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా రొంపిచర్లలో ప్రభుత్వ టీచర్‌గా పని చేస్తున్న.. పాతూరుకు చెందిన మోహన్‌రెడ్డి శనివారం వేకువజామున మద్యం మత్తులో ఆలయ గేటు తొలగించి, విగ్రహం రెండు చేతులు విరగ్గొట్టాడని, అక్కడే ప్రతిష్ఠించిన గ్రామదేవత విగ్రహాన్ని పెకలించాడని గ్రామస్థులు ఆరోపించారు. ఈ మేరకు తిరుచానూరు పోలీసులకూ సమాచారం ఇచ్చారు. దీంతో వారు మోహన్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. తర్వాత రాజకీయ ఒత్తిళ్లతో వదిలేసినట్లు తెలిసింది.




విరిగిన గ్రామదేవత ఎల్లమ్మ చేయి - విరిచిన ఆలయ గేట్లు

సోషల్ మీడియాలో పోస్టులపై ఫిర్యాదు

చంద్రగిరి, అక్టోబరు 13: సోషల్ మీడియాలో మూడు రోజులుగా ఎమ్మెల్యే పులివర్తి నానిపై వస్తున్న ఆరోపణలపై ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డి ఆదివారం చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 9849545556, 8317665273, 9182406832 నంబర్ల నుంచి చంద్రగిరి రాజకీయం, ది తిరుపతి జిల్లా, సూర్య కిరణాలు, తిరుచానూరు మీడియా కుటుంబం వాట్సాప్ గ్రూప్‌లలో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల విషయంలో తన కుటుంబంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ సందేశాలు పంపుతున్నారని, తద్వారా తమను అపఖ్యాతి పాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ నిధారమైన ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. తన తాతకు వందల ఎకరాల ఆస్తులు ఉన్నాయని, చిన్నప్పటి నుంచి తాము కోటీశ్వరులమని, అడ్డదారులు తొక్కాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆ మూడు నంబర్లలో ఒకటి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిదని తెలిసిందన్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రూ.7 వేల జీతంతో జనచైతన్య హౌసింగ్ ప్రైవేటు లిమిటెడ్‌లో కమీషన్ ఏజెంట్‌గా పనిచేశారని, అందుకే భూములు, కమీషన్ల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. గత ఐదేళ్లలో భూములు, ఇసుక, మట్టి దోచుకున్నారని ఆరోపించారు. మరో రెండు నంబర్లు వినియోగిస్తున్న వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఆధారాలు చూపాలని, లేకపోతే మీడియా ముందు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా, టీడీపీ నేతలు గౌస్‌బాషా, రమేష్‌రెడ్డి, కొండూరు ప్రవీణ్, బాలకృష్ణమూర్తి, తులసేశ్వరరెడ్డి, గాలి సతీష్, కన్నయ్యనాయుడు, రామారావు, డిష్ గోపి తదితరులు ఉన్నారు.



ఎస్ఐ అనితకు ఫిర్యాదు చేస్తున్న సుధారెడ్డి

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

చంద్రగిరి, అక్టోబరు 13: మండలంలోని తొండవాడ సమీపంలో ముక్కోటి నుంచి తిరుపతి, పీలేరు జాతీయ రహదారిపై ఆదివారం ఆటో, ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ద్విచక్ర వాహనదారుడుకి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. చంద్రగిరి ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఇదయతుల్లా విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుపతికి బయలుదేరాడు. తొండవాడ సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ఇదయతుల్లాకు కాలు విరిగి, తీవ్ర గాయాలయ్యాయి. దారిలో వెళతున్న వాహనదారులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించినా ఎంతసేపటికి రాకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుళ్లు చిరంజీవి, పెంచల్‌కుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ఆటోడ్రైవర్ పరారయ్యాడు. అదే ఆటోలో ఇదయతుల్లాను చంద్రగిరి సీహెచ్‌సీకి తరలించి, చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ చిరంజీవి

ఆన్‌లైన్ బెట్టింగులకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలి

- రూ.24 లక్షలు పోగొట్టుకున్నట్లు సూసైడ్ నోట్
- రైలు కింద పడి బలవన్మరణం



పద్మనాభరెడ్డి (ఫైల్)

మదనపల్లె అర్బన్, అక్టోబరు 13: ఆన్‌లైన్ బెట్టింగులకు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలయ్యాడు. ఆన్‌లైన్ బెట్టింగులు ఆడి తాను రూ.24 లక్షలు పోగొట్టినట్లు, నాలా మీరు ఎవరూ ఆన్‌లైన్ గేమ్స్ ఆడవద్దని.. అప్పులు తీర్చలేక, తల్లిదండ్రులను ఇబ్బందులు పెట్టకూడదని తాను రైలుకిందపడి ఆత్మహత్య చేసుకొంటున్నట్లు, నా చావుకు ఎవ్వరూ కారణం కాదని సూసైడ్ నోట్ రాసి శుక్రవారం అర్ధరాత్రి సీటీఎం వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కదిరి రైల్వే పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... తంబళ్లపల్లె మండలం ఎద్దులవారిపల్లె పంచాయతీ దిగువ గాలిగుట్టపల్లెకు చెందిన నడిమింటి వెంకటరమణారెడ్డి కుమారుడు పద్మనాభరెడ్డి (27) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసయ్యాడు. గేమ్‌లు ఆడి రూ.24 లక్షలు పోగొట్టుకుని అప్పులు తీర్చలేక తీవ్రంగా మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. జీవితంపై విరక్తి చెంది చనిపోతున్నట్లు సూసైడ్ నోట్‌లో రాసి జేబులో ఉంచుకుని మదనపల్లె మండలం సీటీఎం సమీపంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చి శుక్రవారం అర్ధరాత్రి మదనపల్లెకు వెళుతున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయాన్నే స్థానికులు గుర్తించి కదిరి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ బాషా ప్రమాద స్థలంలో పంచనామా నిర్వహించి అక్కడే పడి ఉన్న సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ బెంగళూరులో పనిచేస్తున్న కంపెనీ ఐడీ కార్డు, ఆధార్‌కార్డును గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో బంధువులు మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. దిగువ గాలిగట్టుపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దాడికి యత్నించారంటూ టీడీపీ నేతపై న్యాయవాదుల ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 13: తమపై టీడీపీ నగర అధ్యక్షుడు వట్టింగుంట శంకర నారాయణ అలియాస్ చినబాబు దాడికి యత్నించారంటూ సహచర న్యాయవాదులతో కలిసి జనసేన నేత, న్యాయవాది ముక్కు సత్యవంతుడు ఎస్పీ సుబ్బరాయుడును కలిసి ఫిర్యాదు చేశారు. 'తిరుపతిలోని కోర్టు సమీపంలో ఉన్న ఓ భవనంలో దాదాపు 30 ఏళ్లుగా ముక్కు సత్యవంతుడు, రమేష్, మధుసూదనరావు, గురప్పనాయుడు తదితరులు ప్రాక్టీసు చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం అనుచరులతో కలిసి చినబాబు, భవనం వద్దకు వచ్చారు. ఎలక్ట్రీషియన్‌ను తీసుకొచ్చి మోటారు వైర్లు కట్ చేయించడానికి ప్రయత్నించగా అడ్డుకున్నాం. ఎందుకిలా చేస్తున్నారు? భవనానికి మీకు ఏమి సంబంధమని అడగ్గా.. సమ్మిటితో దాడికి చినబాబు ప్రయత్నించాడు' అని న్యాయవాదులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై వెస్ట్ సీఐ రామకృష్ణను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, సోమవారం వచ్చి ఫిర్యాదు చేస్తామని న్యాయవాదులు చెప్పారన్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న మునికన్నా

శ్రీకాళహస్తి, అక్టోబరు 13: ఆరేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన అంజూరు మునికన్నా (22) పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి తెలిపిన వివరాలు... తొట్టంబేడు మండలం జ్ఞానమ్మ కండ్రిగ అరుంధతివాడకు చెందిన మునికన్నా భవన నిర్మాణ కార్మికుడు. గతంలో పలు నేరాల్లో నిందితుడు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి పట్టణంలోని పూసలవీధిలో తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డాడని పోలీసులు గుర్తించారు. అలాగే ఆరేళ్ల బాలిక తన మేనత్త సంరక్షణలో పెరుగుతోంది. శనివారం వీధిలో ఆడుకుంటున్న బాలికతో మునికన్నా మాటలు కలిపాడు. ఈ వీధికి సమీపంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశంలోకి బాలికను తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాలిక మేనత్త 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం యువకుడిని అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేశారు. శ్రీకాళహస్తి న్యాయస్థానంలో హాజరు పరచగా 14రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



తిరుచానూరు, అక్టోబరు 13: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం రాత్రి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. తిరుపతికి చెందిన శివనాట్య కళా నిలయానికి చెందిన వినోద్, యువదర్శిని, మహాలక్ష్మి, పూజిత, చాందిని, మోక్షశ్రీ, నిఖిత, లోహిత తదితరులు తాండవ గణపతి, పుష్పాంజలి, శివస్తుతి, శ్రీరామరాజ్యం, శివాష్టకం వంటి భక్తి గీతాలకు నాట్య ప్రదర్శన చేశారు. వారికి ఏవో ఖాదరవల్లి ప్రశంసాపత్రాలు అందజేశారు.

చింతలగుంట కాలనీలో జల్లికట్టు

వెదురుకుప్పం, అక్టోబరు 13: వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లె పంచాయతీ చింతలగుంట కాలనీలో ఆదివారం జల్లికట్టు జరిగింది. ముందస్తు సమాచారం ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి గిత్తలను తీసుకొచ్చారు. వీక్షించడానికి జనం తరలి వచ్చారు. అల్లెని ఏర్పాటు చేశారు. గిత్తలను అలంకరించి, కొమ్ములకు వివిధ రకాల పట్టీలను కట్టి అల్లివైపు వదిలారు. ఆసక్తి యువకులు గిత్తలను నిలువరించే ప్రయత్నం చేశారు. గిత్తల నుంచి పట్టీలు దక్కించుకున్న యువకులు కేరింతలు కొడుతూ వెళ్లారు. గిత్తల కింద పడ్డ కొందరు స్వల్పగాయాలకు గురయ్యారు. తెలుగుదేశం పార్టీ జెండాలతో వెళ్లిన గిత్తలు ఆకర్షణీయంగా కనిపించాయి. జల్లికట్టు నిర్వహణతో ఆ గ్రామంలో జనసందడి ఏర్పడింది.




టీడీపీ జెండాలతో పరుగులిడుతున్న గిత్తలు, అల్లెలో గిత్తలను నిలువరిస్తున్న యువకులు

వైభవంగా పార్వేట ఉత్సవం




పట్టణంలో ఊరేగుతున్న స్వామిఅమ్మవార్లు - వివిధ వేషధారణలో చిన్నారులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 13: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబ సమేత ముక్కంటీశుడికి ఘనంగా పార్వేట ఉత్సవం నిర్వహించారు. ముందుగా ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య పార్వేట ఉత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని తిలకించారు. అమ్మవారి ఊరేగింపులో వివిధ వేషధారణలో కళాకారులు అలరించారు. ఈ కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్ ఆజాద్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మణికంఠేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా శమీపూజ

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 13: కాణిపాకంలోని మణికంఠేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవంలో భాగంగా శనివారం రాత్రి శమీ పూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి ఆలయ మాజీ ఛైర్మన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మణికంఠేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉన్న జమ్మిచెట్టుకు శమీ పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు అగరంపల్లెకు చెందిన మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి అమ్మవారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కాణిపాకం పుర వీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో గురుప్రసాద్, ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.



జమ్మిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్



ఊరేగింపు నిర్వహిస్తున్న ఉభయదారుడు మోహన్‌రెడ్డి, గ్రామస్తులు

ఘనంగా ఆయుధ పూజ



పూజ చేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 13: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ సుబ్బరాయుడు ఆదివారం ఆయుధ పూజ నిర్వహించారు. సాయుధ దళ విభాగంలోని ఆయుధాలు, వాహనాలకు పూజలు చేశారు. వాహనాలు నడిపే డ్రైవర్లకు ఎలాంటి అపాయాలూ జరగకుండా ఉండాలని, ఆయురారోగ్యాలతో విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



తిరుపతి అర్బన్, అక్టోబరు 13: శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు, పెరటాసి మాసం చివరి శనివారం కావడంతో టీటీడీ ఉద్యోగుల సంయుక్త కార్యచరణ సమితి అధ్యక్షుడు అంజనేయులు ఆధ్వర్యంలో అలిపిరి వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా పద్మావతి చిల్డ్రన్స్ హాస్పిటల్ డాక్టర్ భరత్, బర్డ్ ఆస్పత్రి డాక్టర్ క్రాంతి హాజరయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రత్నంశెట్టి, మోహన్‌రాజ్, బెల్లకొండ ప్రసాద్, విజయకుమార్‌రెడ్డి, అరుణ్‌కుమార్, మురళి, మధు, ఉపేంద్ర, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు ఘన నివాళి

తిరుపతి అర్బన్, అక్టోబరు 13: ప్రొఫెసర్ సాయిబాబాకు ఆదివారం రాజకీయ, ప్రజా ఉద్యమ నేతలు ఘన నివాళి అర్పించారు. వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సాయంత్రం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కన్వీనర్ పి.అంజయ్య అధ్యక్షతన ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా కొన్ని నిమిషాలు మౌనం పాటించి, జోహార్లు అర్పించారు. అంజయ్య మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొని, అణగారిన వర్గాల, ఆదివాసీయుల పక్షాన నిలబడినందుకే ప్రభుత్వం ప్రొఫెసర్ సాయిబాబా మరణించేలా చేసిందని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ సాయిబాబా మరో మూడు నెలలు జైల్లో ఉంటే చనిపోతారని భావించి విడుదల చేశారని విమర్శించారు. సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ మాట్లాడుతూ పదేళ్ల క్రితం కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం ప్రశ్నించే వారిని చంపడానికి ప్రైవేటు సైన్యాన్ని తయారు చేసి గౌరిలంకేష్, కల్బుర్గి, పన్సారె వంటి వారిని చంపేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాహితీవేత్త సాకం నాగరాజు మాట్లాడుతూ సాయిబాబా నేటి పోరాటయోధుడని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, రచయిత ఒ.రమణ, పౌరచైతన్య వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాకా ప్రసాద్, ఎ.ఎస్.పరమేశ్వరరావు, లక్ష్మయ్య, భూమన్, క్రాంతి, ప్రతాప్, పెంచలయ్య, విశ్వనాథ్, డాక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ



చౌడేపల్లె, అక్టోబరు 13: బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిక్కిరిసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు. కాగా బోయకొండ గంగమ్మ దేవస్థానం నాణ్యత, భద్రత, తదితరాలను గుర్తించి ఆలయానికి ఐసీఎల్ సంస్థ ఐఎస్‌వో సర్టిఫికెట్ మంజూరు చేసినట్లు ఈవో తెలిపారు. ఆ సంస్థ ప్రతినిధులు రామలక్ష్మి ఈ సర్టిఫికెట్‌ను అందించినట్లు చెప్పారు.



ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందుకుంటున్న ఈవో ఏకాంబరం

బంగారం పేరుతో కుచ్చుటోపి

- రూ.7లక్షలు తీసుకుని ఉడాయించిన ముఠా

గంగవరం, అక్టోబరు 13: బంగారం పేరుతో నమ్మించి రూ.7లక్షలు తీసుకొని ఓ ముఠా ఉడాయించిన ఘటన గంగవరం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆలకుప్పం గ్రామానికి చెందిన శేషయ్యకు కొందరు పరిచయమయ్యారు. మాటామాటా కలుపుతూ తమకు బంగారు నిధులు దొరికాయని, ఎవరైనా ఉంటే తక్కువ ధరకు అమ్మేస్తామని నమ్మించారు. తనకే బంగారు కావాలంటూ శేషయ్య వారికి చెప్పడంతో, రెండు ఒరిజినల్ బంగారు నాణేలను తీసుకొచ్చి ఇచ్చారు. శేషయ్య నాణేలను తీసుకొని ఆచారి వద్దకు తీసుకెళ్లి పరీక్షించగా, నిజమైన బంగారం అని తేలింది. దీంతో అదృష్టం కలిసివచ్చిందని సంబరపడి, తన దగ్గర రూ.7 లక్షలు ఉన్నాయని, ఈ డబ్బుకు సరిపడా బంగారు తీసుకురమ్మని సూచించారు. దీంతో శనివారం ఆ ముఠా సభ్యులు నలుగురు శేషయ్య ఇంటి వద్దకు వచ్చి రూ.7 లక్షలు తీసుకొని, బంగారు నాణేలు కారులో ఉన్నాయని, కారు రోడ్డు పక్కన పెట్టి వచ్చామని, ఇప్పుడే కారులో ఉన్న బంగారం తీసుకొచ్చి మీకు ఇస్తాము ఇక్కడే ఉండండి అని నమ్మించారు. డబ్బుతీసుకుపోయిన ముఠా సభ్యులు ఎంతసేపటికి నాణేలు తీసుకొని రాకపోవడంతో, శేషయ్యకు అనుమానం వచ్చి రోడ్డువద్దకెళ్లి చూడగా కారు కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా వారి ఆచూకీ తెలియకపోవడంతో మోసపోయామని గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

టైరు పేలి లారీకి మంటలు



పుంగనూరు రూరల్, అక్టోబరు 13: లారీ టైరు పేలడంతో మంటలు వ్యాపించి లారీ పాక్షికంగా దగ్ధమైన ఘటన ఆదివారం పుంగనూరు వద్ద చోటుచేసుకుంది. పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు కథనం మేరకు .... పుంగనూరు భగత్‌సింగ్‌కాలనీ సమీపంలోని బైపాస్‌రోడ్డు వద్ద మదనపల్లె నుంచి తమిళనాడు గుడియాత్తంకు కోళ్ల ఆహార పదార్థాలను తీసుకెళుతున్న లారీ వెనుక టైరు పేలి మంటలు రావడంతో గుర్తించిన డ్రైవర్ లారీని పక్కన నిలిపాడు. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. వెనుక ఎడమవైపు నాలుగుటైర్లు, లారీ బాడీ, ఫీడు పాక్షికంగా కాలిపోవడంతో దాదాపు రూ. 3లక్షల నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారి తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు.

గంగమ్మ ఆలయంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు



తిరుపతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విజయదశమి రోజున తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దంపతులు ప్రత్యేక పూజలు చేయించారు. అమ్మవారికి హోమం నిర్వహించి అభిషేకం చేశారు. కార్యక్రమంలో గంగమ్మ ఆలయ మాజీ ఛైర్మన్, టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, కూటమి నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, పులుగోరు మురళి, కంకణాల రజినీకాంత్, మహేష్ యాదవ్, హేమంత్ యాదవ్, భరణి యాదవ్, రాజా రెడ్డి, జలపోతు చంద్ర, ఆముదాల తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదికి అభినందన



దినకర్ దంపతులను సత్కరిస్తున్న మిత్రబృందం

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 13: నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది, తిరుపతి బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు తమిదలపాటి దినకర్ ఇటీవల తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ న్యాయవాదిగా నియమితులైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన మిత్రబృందం ఆదివారం ఆయన ఇంటి వద్ద అభినందించి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనార్దన్, శ్రీనివాస్, దేవరాజులు, చిన్న, శ్రీధర్, బాలకృష్ణ, రాము, ధనంజయులు, శేఖర్, మణి పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 13 : అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి చెన్నయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీ లోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ముగిసిన సాంస్కృతికోత్సవాలు



కొల్లూరి వందన గాత్ర కచేరి

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 13: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజు తొలుత శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల గాత్ర విభాగం సీనియర్ అధ్యాపకురాలు డాక్టర్ కొల్లూరి వందన గాత్ర కచేరి నిర్వహించారు. వీరు ఆలపించిన త్యాగరాజ, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితుల కృతులు, అన్నమయ్య కీర్తనలు సభికులను భక్తి రససాగరంలో ముంచెత్తాయి. తెనాలికి చెందిన తేజస్వి కూచిపూడి నృత్యం అలరించింది. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజక్టు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ఉమముద్దుబాల, సప్తగిరి ఉప సంపాదకులు డాక్టర్ అల్లాడి సంధ్య పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.24 కోట్లు

తిరుమల, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రెండు రోజుల్లో రూ.5.24 కోట్లు లభించింది. గురు, శుక్రవారాల్లో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక శుక్ర, శనివారాల్లో 1.45 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 63,430 మంది తలనీలాలు సమర్పించారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

ఆలయాల్లో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు వివిధ అలంకరణల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో..

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 13: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో చివరి రోజు అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకం, హోమం, సహస్రనామార్చన నిర్వహించారు. రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, గుండాల గోపినాథ్ అమ్మవారికి సారె సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని రాజరాజేశ్వరిదేవి అలంకారంలో ఊరేగించారు. ఈవో జయకుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



రాజరాజేశ్వరీదేవిగా గంగమ్మ

కపిలతీర్థంలో..

కపిలేశ్వరాలయంలో శనివారం ఉదయం యాగశాల పూజ, స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం కామాక్షి అమ్మవారికి సరస్వతిదేవి అలంకరణలో ఊంజలసేవ నిర్వహించారు. కామాక్షి అమ్మవారు శివపార్వతుల రూపంలో భక్తులను అనుగ్రహించారు. 6 గంటలకు కపిలతీర్థంలోని అభయహస్త ఆంజనేయస్వామి ఆలయప్రాంగణంలో అమ్మవారికి పార్వేట ఉత్సవం నిర్వహించారు.

రాజరాజేశ్వరిగా మూలస్థాన ఎల్లమ్మ

- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, అక్టోబరు 13: తుమ్మలగుంట చెంచువారి కాలనీలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో శనివారం అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహయాదవ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు కుంకుమలతో కూడిన సారె సమర్పించారు. ఆలయ ధర్మకర్తలు బిరుదాల కృష్ణారెడ్డి, బిరుదాల హనుమంతరెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యే నానికి స్వాగతం పలికి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు.



సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే నాని, నరసింహయాదవ్

వైభవంగా సింహ వాహన సేవ

తిరుపతి రూరల్, అక్టోబరు 13: పెరుమాళ్లపల్లె ఏకాంబరేశ్వరీదేవి సింహ వాహన సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. యాకారమ్మ ఆలయంలో అమ్మవారు ఏకాంబరేశ్వరి దేవిగా సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, దాత డాలర్స్ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలంగి సేవ కన్నుల పండువగా నిర్వహించారు.



అమ్మవారి సేవలో డాలర్స్ దివాకర్‌రెడ్డి

రాజరాజేశ్వరిదేవిగా చాముండేశ్వరి

తిరుపతి రూరల్, అక్టోబరు 13: తుమ్మలగుంట క్రాస్‌రోడ్డు ఎల్ఎస్ నగర్ కాలనీలోని శక్తి చాముండేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో చివరిరోజు శనివారం అమ్మ వారు రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చంద్రగిరి, తిరుపతి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, డాక్టర్ సుధారాణి దంపతులు అమ్మవారికి సారె సమర్పించి దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో బొంతాలమ్మ

తిరుపతి (జీవకోన), అక్టోబరు 13: కరకంబాడి రోడ్డులోని బొంతాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శనివారం రాత్రి ప్రత్యేక అలంకరణలో కొలువుదీరారు. పురవీధుల్లో ఊరేగించగా భక్తులు పెద్దసంఖ్యలో మొక్కులు తీర్చుకున్నారు.



కమనీయం రాజరాజేశ్వరి కల్యాణం



రామచంద్రాపురం, అక్టోబరు 13: సురభి గోశాల ఆవరణలోని దుర్గాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం రాజరాజేశ్వరి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా విశేష పూజలు చేశారు. ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్‌స్వామి ఆధ్వర్యంలో సూరవారిపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. రాయలచెరువుకట్ట జలకంఠేశ్వరాలయంలో వెలసిన భవానీ అమ్మవారు, మహాలక్ష్మి అమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

గజలక్ష్మి నమోస్తుతే..!



తిరుచానూరు, అక్టోబరు 13: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు శనివారం రాత్రి గజ వాహన సేవతో ముగిశాయి. రాత్రి సర్వాలంకార శోభితురాలైన అమ్మవారు గజ వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్లు శేషగిరి, కేపీ చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

మహిషాసుర మర్దినిగా మూలస్థాన ఎల్లమ్మ



చంద్రగిరి, అక్టోబరు 13: చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ చివరి రోజు పుష్పపల్లకిలో మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టుపీతాంబరాలు, బంగారు ఆభరణాలతో మహిషాసుర మర్దిని అలంకరణ చేసి పుష్పపల్లకిపై పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, ఉభయదారులు మణ్యం మునిరెడ్డి, కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయ ఆవరణలోని సంతోషిమాతను రాజరాజేశ్వరిగా అలంకరించి సహస్రనామార్చన చేశారు. తొండవాడలోని ఉగ్రప్రత్యింగిరాదేవి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని దశమి దుర్గగా మహిషాసుర మర్దిని అలంకరణ చేసి, ఆలయ ఆవరణలో కొలువుదీర్చారు. ఆలయ పీఠాధిపతి సూరిస్వామి పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



తిరుచానూరు, అక్టోబరు 13: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీవీ జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయాధికారులు స్వాగతం పలికారు. న్యాయమూర్తి ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి, మూలమూర్తిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ఎమ్మెల్యేలు పంతం నానాజీ, గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మాజీ ఎంపీ చింతా మోహన్, నందమూరి వసుంధర ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.







పంతం నానాజీ, గురుజాల జగన్మోహన్ వసుంధర

సాహితీవేత్తలు, రైతులకు గార్లపాటి పురస్కారాలు

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 13: స్థానిక రాస్ భవనంలో ఆదివారం గార్లపాటి పురస్కారాలు ప్రదానం చేశారు. సాహితీ ప్రక్రియల్లో విశేష కృషిచేసిన లంకిపల్లి కన్నయ్య నాయుడు, డాక్టర్ రామలక్ష్మి, జిల్లేళ్ల బాలాజీ, గుడివాడ అన్నయ్య నాయుడు, పేరూరు బాలసుబ్రమణ్యం, ఆదర్శ రైతులు కోటపాటి గంగాధరం, నరసింహులునాయుడులకు పురస్కారాలు ప్రదానం చేశారు. రూ.ఐదువేలు నగదు, జ్ఞాపిక, శాలువలతో సత్కరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ తల్లిదండ్రుల పేరుతో సమకాలీన సాహితీవేత్తలను సత్కరించడం మంచి సంప్రదాయమన్నారు. విశ్రాంత ఆచార్యులు కె.సర్వోత్తమరావు మాట్లాడుతూ సాహితీ రచన మనిషి వ్యక్తిత్వానికి, వికాసానికి గీటురాయని, సమాజాన్ని ముందుకు నడిపిస్తుందని పేర్కొన్నారు. మరొక అతిథి డాక్టర్ లింగుట్ల రమేష్ నాథ్ మాట్లాడుతూ తెలుగుభాషా సేవకులైన కవులు, రచయితలను పురస్కారాలతో సత్కరించడం మంచి సంప్రదాయమన్నారు. సభకు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు అధ్యక్షత వహించగా, శతావధాని ఆముదాల మురళి, ఏనుగు అంకమనాయుడు పురస్కార గ్రహీతలను సభకు పరిచయం చేశారు. వేమూరి జయరామ్ ప్రసాద్ స్వాగతం పలికారు. డాక్టర్ నెమిలేటి కిట్టన్న వందన సమర్పణతో సభ ముగిసింది. సభలో సాకం నాగరాజ, యువశ్రీమురళి, కంపల్లి రవిచంద్రన్, ఆర్సీ కృష్ణస్వామి రాజు, గాలి గుణశేఖర్, తోట వెంకటేశ్వర్లు, ఆకుల మల్లేశ్వరరావు, మస్తానమ్మ, సుహాసిని, కొణిదల శోభ, సుభద్ర, ఎంఆర్ అరుణకుమారి, సహదేవనాయుడు, రచయిత మౌని తదితరులు పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

బురదలో కూరుకుపోయిన అంబులెన్స్



- ఇబ్బంది పడిన పేషెంట్

చిత్తూరు సిటీ, అక్టోబరు 13: చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి వద్ద అంబులెన్స్ బురదలో కూరుకుపోయింది. దీంతో అందులో ఉన్న పేషెంట్ అర్ధగంటపాటు వైద్యం అందక ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వ వైద్యశాల ప్రధాన గేటువద్ద ఉన్న క్యాటిల్ ట్రాప్ పాడవడంతో మరమ్మతులకోసం ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేశారు. తేనెబండకు వెళ్లే మార్గంలో ఈ గేటువుంది. కాగా ఇక్కడ సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో రోడ్డు బురదమయంగా తయారైంది. ఆదివారం పేషెంట్‌తో వచ్చిన అంబులెన్స్ ఇక్కడ ఇరుక్కుపోయింది. సుమారు అర్ధగంటపాటు అంబులెన్స్ ముందుకు, వెనుకకూ కదులుతుండటంతో లోపలున్న పేషెంట్ ఇబ్బంది పడ్డారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా తయారైంది. ఇక్కడ మొరం మట్టి (గట్టి మట్టి)తో రోడ్డు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం వద్ద తెగిపోయిన పొర్లుకట్టలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా

వాకాడు, అక్టోబరు 13: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంతో అల్పపీడనంగా మారి ఈనెల 14, 15, 16 భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో మండల అధికారులను సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా అప్రమత్తం చేశారు. ఆదివారం ఆయన మండలంలో పర్యటించారు. గత ఏడాది డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్‌తో బాలిరెడ్డిపాళెం వద్ద స్వర్ణముఖినది వద్ద తెగిపోయిన పొర్లుకట్టలను పరిశీలించారు. పొర్లు కట్టలు నిర్మాణదశలో ఉండటంతో కాంట్రాక్టర్లను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బాలిరెడ్డిపాళెం వద్ద ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన షెల్టర్‌ను తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణారావుతో కలసి పరిశీలించారు. భారీ వర్షం కురిసి పిడుగులు పడే అవకాశం ఉండటంతో వ్యవసాయదారులు, పశువుల కాపర్లు, మత్స్యకారులు బయటకు వెళ్లవద్దని సూచించారు. ఆయన వెంట ఇరిగేషన్ ఏఈ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఉన్నారు.

కోట: మండల పరిధిలోని పుచ్చలపల్లిలో స్వర్ణముఖినది పొర్లుకట్టలను సబ్ కలెక్టర్ రాఘువేంద్రమీనా పరిశీలించారు. పుచ్చలపల్లి దొరువుకట్ట మార్గంలో కట్టలు బలహీనంగా ఉన్నాయని, ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం సముద్రం ఒడ్డున ఉన్న గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామాన్ని సందర్శించి మత్స్యకారులతో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు షెల్టర్లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా పునరావాస కేంద్రాల వద్ద నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచాలన్నారు. తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాని ఆదేశించారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, వివిధశాఖల అధికారులు ఉన్నారు.

తుఫాన్ అప్రమత్తతపై సమీక్ష



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

సూళ్లూరుపేట, అక్టోబరు 13: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, ఇది అల్పపీడనంగా మారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ఆర్డీవో కిరణ్మయి ఆదివారం తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎటువంటి విపత్తు జరిగిన ఎదుర్కొనేందుకు అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తీరప్రాంత గ్రామాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేసేందుకు ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 08623-295345 ఫోన్ నెంబరు అందుబాటులో పెట్టామన్నారు. అనంతరం ఆమె కేవీబీపురం మండలంలో కాళంగి రిజర్వాయర్‌ను అధికారులతో కలసి పరిశీలించారు. ఏవో రవికుమార్, ఎస్ఐ బ్రహ్మానాయుడు తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి: అల్పపీడనం కారణంగా రాబోయే మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు వివిధ శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. ఆదివారం ఆయన తన కార్యాయంలో అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తుఫాను కారణంగా మూడు రోజులు పాటు భారీ వర్షాలు కురిపే అవకాశాలు వున్నందున వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోనే వుంటూ ప్రజలును అప్రమత్తం చేయాలని సూచించారు. డక్కిలి రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి పరిపరిస్థితినైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్దంగా వుండాలని కోరారు. అన్ని శాఖల సిబ్బంది ఎవ్వరూ సెలవులు పెట్టరాదని సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువుల స్థితిగతులను తెలుసుకొని రైతులను అప్రమత్తం చేయాలని కోరారు.

గూడూరు అర్బన్: తుపాన్ హెచ్చరిక నేపథ్యంలో ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆదివారం కలెక్టర్ వెంకటేశ్వర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మధుసూదనరావు మాట్లాడుతూ ఈనెల 14నుంచి 17వ తేదీ వరకు బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తుఫాన్ వచ్చే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాయుడుపేట: తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణశాఖ హెచ్చరించడంతో కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను అప్రమత్తం చేశారు. ఆదివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దారు గీతావాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు. 15, 16, 17 తేదీల్లో భారీ వర్షాల సూచన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఎన్నిక



నూతన కమిటీతో షార్ మాజీ డైరెక్టర్ నారాయణ తదితరులు

సూళ్లూరుపేట, అక్టోబరు 13: సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థులు సమావేశం జరిగింది. షార్ మాజీ డైరెక్టర్ కె.నారాయణ, పలువురు ప్రముఖులు విచ్చేశారు. కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ ఏ.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఎల్.శ్రీనివాసులు, వి.శివకుమార్‌రెడ్డి, కార్యదర్శిగా టి.ఆదినారాయణరెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎస్‌కే ఉస్మాన్ భాషా, ట్రెజరర్‌గా బి.ధనుంజయరెడ్డితో పాటు 11మంది సభ్యులను ఎన్నుకొన్నారు.

సాహితీవేత్తలు, రైతులకు గార్లపాటి పురస్కారాలు

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 13: స్థానిక రాస్ భవనంలో ఆదివారం గార్లపాటి పురస్కారాలు ప్రదానం చేశారు. సాహితీ ప్రక్రియల్లో విశేష కృషి చేసిన లంకిపల్లి కన్నయ్య నాయుడు, డాక్టర్ రామలక్ష్మి, జిల్లేళ్ల బాలాజీ, గుడివాడ అన్నయ్య నాయుడు, పేరూరు బాలసుబ్రమణ్యం, ఆదర్శ రైతులు కోటపాటి గంగాధరం, నరసింహులునాయుడుకు పురస్కారాలు ప్రదానం చేశారు. రూ.ఐదువేల నగదు, జ్ఞాపిక, శాలువలతో సత్కరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ తల్లిదండ్రుల పేరుతో సమకాలీన సాహితీవేత్తలను సత్కరించడం మంచి సంప్రదాయమన్నారు. విశ్రాంత ఆచార్యులు కె.సర్వోత్తమరావు మాట్లాడుతూ సాహితీ రచన మనిషి వ్యక్తిత్వానికి, వికాసానికి గీటురాయని, సమాజాన్ని ముందుకు నడిపిస్తుందని పేర్కొన్నారు. మరొక అతిథి డాక్టర్ లింగుట్ల రమేష్ నాథ్ మాట్లాడుతూ తెలుగుభాషా సేవకులైన కవులు, రచయితలను పురస్కారాలతో సత్కరించడం మంచి సంప్రదాయమన్నారు. సభకు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు అధ్యక్షత వహించగా, శతావధాని ఆముదాల మురళి, ఏనుగు అంకమనాయుడు పురస్కార గ్రహీతలను సభకు పరిచయం చేశారు. వేమూరి జయరామ్ ప్రసాద్, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, సాకం నాగరాజ, యువశ్రీమురళి, కంపల్లి రవిచంద్రన్, ఆర్‌సీ కృష్ణస్వామి రాజు, గాలి గుణశేఖర్, తోట వెంకటేశ్వర్లు, ఆకుల మల్లేశ్వరరావు, మస్తానమ్మ పాల్గొన్నారు.





గూడూరు: గ్రామోత్సవంలో విజయదుర్గాదేవి, నారాయణమ్మ, మహాలక్ష్మమ్మ, బజారు కలశం దుర్గాదేవి, ద్రౌపదీదేవి



సూళ్లూరుపేట: చెంగాళమ్మ గ్రామోత్సవం



గూడూరు: ధర్మరాజస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పూజలు

వైభవోపేతం... అమ్మవార్ల గ్రామోత్సవం

గూడూరు, అక్టోబరు 13: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పట్టణంలో అమ్మవార్ల గ్రామోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించారు. నవరాత్రుల్లో భాగంగా తొమ్మిరోజుల పాటు అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. శనివారం రాత్రి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై ఉంచి కలశోద్వాసనకు తరలించి గ్రామోత్సవం జరిపారు. స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో అమ్మవారిని, నారాయణమ్మ ఆలయంలో అమ్మవారిని, రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవార్లను రాజరాజేశ్వరిదేవిగా, ధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదిదేవిని, బజారుకలశంలో దుర్గాదేవి అమ్మవారిని మహిషాసురమర్ధినిగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. వాలయనందాపురం, బొడ్డు చౌక, వీరారెడ్డిపల్లిలోని మహాలక్ష్మమ్మ అమ్మవార్లను శక్తి రూపంలో ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. కేరళవాయిద్యాలు, మంగళ మేళాలు, తప్పెట్లు తాళాలు, పార్వతీమహిషాసుర యుద్ధ నృత్యాలు, కోలాటాలు, కీలుగుర్రాల నృత్యాలు, జింగిరిమేళాలు, తెనాలి బ్యాండ్ మ్యూజిక్, యువత చిందుల నడుమ బాణసంచా పేల్చుతూ పట్టణపుర వీధుల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు ఊరేగించారు. ఈ నెల మూడో తేది నుంచి కలశ స్థాపనతో ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు అమ్మవార్ల కలశోద్వాసనతో ఆదివారం ముగిశాయి. స్థానిక ధర్మరాజస్వామి ఆలయం వద్ద ద్రౌపదీదేవికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పూజలు నిర్వహించారు. గ్రామోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ రమణకుమార్ పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓజిలి: మండలంలో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఓజిలి, మానమాల, కురుగొండ, ఆరిమేనిపాడు, అత్తివరం, చిల్లమానుచేను, సగుటూరు గ్రామాల్లోని దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మూకాంబికాదేవి రాజరాజేశ్వరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే దంపతులను టీడీపీ నాయకుడు కుబేరు మణి శాలువాకప్పి సన్మానించారు.

నాయుడుపేట: విజయదశమి పురష్కరించుకుని పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి, పోలేరమ్మ, ముకాంబికాదేవి ఆలయాలతో పాటు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముకాంబికాదేవి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించి ప్రత్యేక పూజల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా రూరల్ అధ్యక్షుడు గూడూరు కిషోర్ కుమార్, గౌరవ అధ్యక్షుడు పెసల జయరాజ గోపాల్ తదితరులు అందజేసిన చీర, సారెను ఆర్యవైశ్య మహిళలకు అందజేశారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ విజయ దశమి రోజున శనివారం మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులు పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. ఉదయం మహాచండీయాగం నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం జరిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యహరించారు. సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవ నాయుడు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

కోట: గ్రామదేవత కోటమ్మకు శనివారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు చేసి గ్రామోత్సవం, పల్లకీ సేవ నిర్వహించారు.



నాయుడుపేట టౌన్: ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు కుబేరు మణి



నాయుడుపేట టౌన్: రాజరాజేశ్వరిదేవి అలంకరణలో మూకాంబికాదేవి - కోట: కోటమ్మ ఊరేగింపు - గూడూరు: గ్రామోత్సవంలో పార్వతి, మహిషాసుర నృత్యాలు

గుర్తుతెలియని వాహనం ఢీకొని హోటల్ మేనేజర్ మృతి



మధురెడ్డి (ఫైల్‌ఫొటో)

చిల్లకూరు, అక్టోబరు 13: మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలోని కోల్డ్ స్టోరేజ్ వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం మోటారు సైకిల్‌ను ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... ముత్తుకూరు మండలం పంటపాళెం గ్రామానికి చెందిన మధురెడ్డి (54) రైటాసత్రం వద్ద ఉన్న ఓ ప్రైవేటు హోటల్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ స్థానిక కోకోల్ గార్డెన్‌లో నివాసముంటున్నాడు. శనివారం రాత్రి హోటల్ నుంచి మోటారుసైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. మధురెడ్డి తీవ్రంగా గాయపడడంతో స్థానికులు నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మధురెడ్డి భార్య, కుమార్తె, కొడుకు ఉన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

ఒకరి మృతి, నలుగురికి గాయాలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 13: నాయుడుపేట - చంద్రబాబు కాలనీ జాతీయ రహదారి సమీపంలో ఆటోను కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా నలుగురికి గాయాలయ్యాయి. మండలంలోని అన్నమేడు గ్రామానికి చెందిన నలుగురు మహిళలు ఆటోలో ఆదివారం సూళ్లూరుపేటలో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. చంద్రబాబుకాలనీ జాతీయ రహదారికి సమీపంలోకి రాగానే వెనుక వైపు నుంచి కారు ఢీకొంది. ఈప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న శాంతమ్మ (62) అక్కడికక్కడే మృతి చెందింది. ఆటో డ్రైవర్ శంకర్, కుమారి, రత్న, శైలజకు గాయాలయ్యాయి. శాంతమ్మ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యానగర్‌లో పాస్టర్స్ డే సంబరాలు

కోట, అక్టోబరు 13: మండల పరిధిలోని విద్యానగర్‌లో గల హోలీప్రేయర్ చర్చిలో ఆదివారం పాస్టర్స్ డే సంబరాలు జరిగాయి. బిషప్ డాక్టర్ ఎంజే ప్రదీప్‌కుమార్, పాస్టర్ బెన్నీలను ఆధ్వర్యంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల సంఘ కాపరులు, సభ్యులు కేక్‌కట్ చేశారు.

ఆకట్టుకున్న ఎడ్ల పందేలు

వాకాడు, అక్టోబరు 13: మండల పరిధిలోని ఐటీఐ ప్రాంగణంలో దసరా సంబరాలను పురస్కరించుకొని ఆదివారం వాకాడు గ్రామస్తులు ఎడ్ల పందేలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి ఎడ్ల పందేలను ప్రారంభించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.24 కోట్లు

తిరుమల, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రెండు రోజుల్లో రూ.5.24 కోట్లు లభించింది. గురు, శుక్రవారాల్లో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక శుక్ర, శనివారాల్లో 1.45 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుచానూరు. అక్టోబరు 13: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయాధికారులు స్వాగతం పలికారు. న్యాయమూర్తి ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి, మూలమూర్తిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

రైళ్ల రాకపోకల పునరుద్ధరణ



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్

తడ, అక్టోబరు 13: చెన్నై - సూళ్లూరుపేట మధ్య రైళ్ల రాకపోకలను కొంతమేర పునరుద్ధరించారు. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా కవరైపేట రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి లూప్‌లైన్‌లో ఆగివున్న గూడ్సు రైలును మైసూరు నుంచి దర్భంగాకు వెళ్తున్న బాగ్మతి ఎక్స్‌ప్రెస్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎక్స్‌ప్రెస్ రైలుకు చెందిన రెండు ఏసీ బోగీల్లో మంటలు చెలరేగాయి. మరో 10 బోగీలు పట్టాలు తప్పాయి. దీంతో చెన్నై - సూళ్లూరుపేట మధ్య రైళ రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రెండు ట్రాక్‌లు దెబ్బతినడంతో సదరన్ రైల్వే అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. శనివారం రాత్రి 8 గంటల సమయానికి అప్‌లైన్‌లను పునరుద్ధరించగలిగారు. అప్పటి నుంచి ఒకే లైన్‌లో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడిపారు. ఆదివారం ఉదయానికి రెండో లైన్ ట్రాక్ పనులను పూర్తిచేసి అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడిపారు. ప్రస్తుతం లూప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. సూళ్లూరుపేట - చెన్నై - నెల్లూరు మధ్య నడిచే లోకల్ మెమో రైళ్లను సోమవారం నుంచి నడపనున్నట్లుగా తెలిసింది. దసరా పండగ వేళ ప్రమాదం కారణంగా రైళ్ల రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైళ్ల రద్దుతో ఆర్టీసీ బస్సులన్నీ కిటకిటలాడాయి.

టీడీపీ నేత రఫీకి పితృవియోగం



చాన్‌బాషా మృతదేహానికి నివాళులర్పిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, అక్టోబరు 13: టీడీపీ నేత, మున్సిపల్ వైస్‌చైర్మన్ రఫీకి పితృవియోగం కలిగింది. రఫీ తండ్రి చాన్‌బాషా(62) ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, అమృత సరళ దంపతులు చాన్‌బాషా మృతదేహానికి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు నెలవల రాజేష్, చక్రపాణి, జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, రాజేంద్ర, పసల చెంగయ్య తదితరులు కూడా నివాళులర్పించారు.

ఎమ్మెల్యే చొరవతో పాఠశాలలో అభివృద్ధి పనులు



పాఠశాల ఆవరణను చదును చేయిస్తున్న హెచ్‌ఎం, స్థానికులు

చిల్లకూరు, అక్టోబరు 13: మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చొరవతో అభివృద్ధి పనులు చేపట్టారు. గతంలో గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు వర్షాల సమయంలో పాఠశాల ఆవరణలో వర్షపునీరు నిల్వచేరి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సిబ్బంది తెలిపారు. ఆదివారం పాఠశాలలో మట్టిని తోలి చదును చేసే పనులు చేపట్టడంతో పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయుడు మాధవయ్య, వేణుగోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి



దయాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న నరేంద్రరెడ్డి తదితరులు

పెళ్లకూరు, అక్టోబరు 13: ప్రధాని మోదీ పాలన పట్ల ఆకర్షితులైన ప్రజలు బీజేపీ క్రియాశీలక సభ్యత్వం తీసుకుంటున్న క్రమంలో తిరుపతి జిల్లాను సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తాళ్వాయిపాడులో ఎద్దల నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే సభ్యత్వ నమోదులో జిల్లా మూడో స్థానంలో ఉందన్నారు. నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో మొదటి స్థానంలో ఉండేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోగుతొటి మురళి, సురేష్‌రెడ్డి, నరసింహులు తదితరులు ఉన్నారు.

పల్లెపండుగ వారోత్సవాలను విజయవంతం చేద్దాం: జనసేన



మీడియాతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

కోట, అక్టోబరు 13: మండలంలోని గ్రామాల్లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్‌రావు కోరారు. కోటలోని గ్రామదేవత కోటమ్మను ఆదివారం జనసేన నాయకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గం గ్రామసభల్లో ఆమోదం పొందిన పనులు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభం అవుతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు భాగస్వామ్యం కావా లన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మోహన్, బాలసుబ్రహ్మణ్యం, శివకుమార్, క్రాంతి, భాస్కర్, వెంకయ్య, మనోజ్‌కుమార్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

25నుంచి హాకీ శిక్షణ

గూడూరు అర్బన్, అక్టోబరు 13: కాకినాడలోని డీఎస్ఏ స్టేడియంలో ఈనెల 25నుంచి నవంబరు 2వ తేదీ వరకు హాకీ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిరాజు తెలిపారు. ఈ ఏడాది జూన్‌లో హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ధర్మవరంలో సీనియర్ పురుషుల ఛాపియన్‌షిప్ పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి జట్టును ఎంపిక చేయడం జరిగిందన్నారు. వారికి కాకినాడలో శిక్షణ ఇవ్వనున్నట్లు రవిరాజు తెలిపారు.

లారీ ఢీకొని యాచకుడికి గాయాలు

చిల్లకూరు, అక్టోబరు 13: మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం లారీ ఢీకొని యాచకుడికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు... వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో భిక్షాటన చేసుకునే యాచకుడు సమీపంలోని జాతీయ రహదారి పక్కన నిలబడివుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళుతున్న లారీ ఢీకొనింది. యాచకుడికి గాయాలవడంతో 108 వాహనంలో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

అధికార యంత్రాంగం సన్నద్ధం


ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబరు 13: రానున్న భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో అన్ని శాఖల అధికారులను సన్నద్ధం చేశామని శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం కంట్రోల్ రూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుంచి 17వరకు శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు సమస్య తలెత్తితే టోల్‌ఫ్రీ నెం.9966524952కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అలాగే శ్రీకాళహస్తి పురపాలకసంఘంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులంతా అందుబాటులో ఉంటారన్నారు. పాతబడిన ఇళ్లు, మట్టిగోడల నిర్మాణాలు వద్ద జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండండి: ఎమ్మెల్యే



వాతావరణ శాఖ భారీ వర్షసూచన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సుధీర్ కోరారు. ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు.

ప్రాణ నష్టం జరగకుండా చూడండి


వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: రానున్న నాలుగు రోజులు తుఫాన్ ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతవరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రాణ, జంతు నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సుబ్రమణ్యం ఆదేశించారు. కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు మండల పరిషత్ కార్యాలయంలో హాజరయ్యారు. లోతట్టు ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి భోజనం తదితర వసతులు కల్పించాల్సి ఉందన్నారు. ఎంపీడీవో త్రివిక్రమరావు, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యలకు కంట్రోల్ రూం

రేణిగుంట: అల్పపీడనం కారణంగా సోమవారం నుంచి భారీ వర్షాలు కురిసే నేపథ్యంలో మండల పరిధిలో సహాయ చర్యల కోసం కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ఇద్దరు వీఆర్‌ఏలు, వీఆర్వోలను నియమించినట్లు తహసీల్దారు తెలిపారు.

వరదయ్యపాళెం: భారీ వర్ష సూచన నేపథ్యంలో సోమవారం నుంచి అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని వరదయ్యపాళెం తహసీల్దారు రాజశేఖర్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.

సత్యవేడు: రానున్న మూడు రోజులు అధికారులు అప్రమత్తంగా ఉంటూ తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలని తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం స్పష్టం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో తుఫాన్ ప్రభావంపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై మండల అధికారులతో ఆయన సమీక్షించారు. పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. చెరువు కట్టలు బలహీనంగా ఉంటే పటిష్ఠపరిచే చర్యలు చేపట్టాలన్నారు. వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలని కోరారు. ఎంపీడీవో చంద్రశేఖర్, దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి గుణశేఖర్, తెలుగుగంగ జేఈలు వెంకటేశ్వర్లు, మహేష్, బాబు పాల్గొన్నారు.

మైమరపించిన నృత్య ప్రదర్శన



శ్రీకాళహస్తి, అక్టోబరు 13: పట్టణంలోని బహదూరుపేట వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ దసరా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం హర్షిత సూర్యకుమార్ భరతనాట్య ప్రదర్శన అలరించింది. శంకర శ్రీగిరి, గణేష పంచరత్నం వంటి గీతాలకు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

పుత్తూరు వార్తలు

పుత్తూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో..

18 మద్యం దుకాణాలకు 230 దరఖాస్తులు

- రాష్ట్ర ప్రభుత్వానికి రూ.4.60 కోట్ల ఆదాయం

పుత్తూరు అర్బన్, అక్టోబరు 13: పుత్తూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. 18 మద్యం దుకాణాలకు 230 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ మురళీ మోహన్ పేర్కొన్నారు. ఈ దరఖాస్తులతో రాష్ట్రప్రభుత్వానికి రూ.4.60 కోట్ల ఆదాయం చేకూరినట్టైంది. నారాయణపురం, వడమాలపేటల్లో మద్యం దుకాణాలకు ఎక్కువ సంఖ్యలో పోటీ నెలకొంది. రామచంద్రాపురం మండలంలో 4 మద్యం దుకాణాల్లో మూడింటికి సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాయి. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో కూడా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. సోమవారం ఉదయం మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియను లాటరీ పద్ధతిలో చేపట్టనున్నారు. తిరుపతి సమీపంలోని శిల్పారామంకు దరఖాస్తుదారులు ఉదయం 7 గంటలకే చేరుకోవాలని సీఐ కోరారు.

విజయలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి



వడమాలపేట, అక్టోబరు 13: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కన్యకాపరమేశ్వరి దేవిని విజయలక్ష్మి అలంకరణ చేసి ఊరేగించారు. ఆదివారం ఉదయం గణపతి హోమం, అభిషేకం, పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని విజయలక్ష్మిగా పూలమాలలతో అలంకరించి మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



వడమాలపేట, అక్టోబరు 13: వడమాలపేట జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో 2007-08 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు ఆదివారం గెట్ టు గెదర్ ఏర్పాటు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. గత స్మృతులను నెమర వేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు.

శ్రీ కేబుల్ నెట్‌వర్క్ ప్రారంభం


ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే భానుప్రకాష్ తదితరులు

పుత్తూరు టౌన్, అక్టోబరు 13: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద శ్రీ డిజిటల్ నెట్‌వర్క్ కార్యాలయం, ఓటీటీ సేవలను ఎమ్మెల్యే భానుప్రకాష్ ప్రారంభించారు. దానికి ముందు పట్టణంలోని శివసాయినగర్‌లో బీఎస్ బాక్స్ క్రికెట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చినబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యుగంధర్, మాజీ ఎంపీపీ డీఎన్ ఎలుమలై, శ్రీశైలం ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్ చక్రపాణి రెడ్డి, కేబుల్ నెట్‌వర్క్ యజమానులు నారాయణబాబు, శ్రీధర్ రాజు, బి.సుబ్రమణ్యం, భాస్కర్‌రెడ్డి, రవిశేఖర్‌రాజు, బాబు, హరి, షణ్ముగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీవించమ్మ రాజరాజేశ్వరి...


రాజరాజేశ్వరిగా వేడాం దక్షిణ కాళికాదేవి, బీపీ అగ్రహారం పెద్దగంగమ్మ, పొన్నాలమ్మ - ప్రత్యేక అలంకారంలో నల్లగంగమ్మ - మీనాక్షి సుందరేశ్వరస్వామి కల్యాణం అలంకారంలో బజారువీధి కన్యకాపరమేశ్వరి - మహాదుర్గ అలంకారంలో బహదూరుపేట కన్యకాపరమేశ్వరి - ప్రత్యేక అలంకారంలో కనకాచలం కనకదుర్గమ్మ ఉత్సవమూర్తి

శ్రీకాళహస్తి, అక్టోబరు 13: దీవించమ్మ రాజరాశ్వరి తల్లి అంటూ భక్తులు అమ్మవార్లకు మొక్కారు. దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం వివిధ రూపాల్లో ఆయా ఆలయాల్లో కొలువైన అమ్మవార్లు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ముక్కంటి ఆలయంలో కనక దుర్గమ్మ రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. వేడాం గ్రామంలో కొలువై ఉన్న దక్షిణకాళికాదేవి రాజరాజేశ్వరిదేవిగా, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి మూలమూర్తి ప్రత్యేకాలంకారం, ఉత్సవమూర్తి మీనాక్షి సుందరేశ్వరస్వామి కల్యాణం అలంకారంలో భక్తులను కటాక్షించారు. పానగల్ గంగమ్మ ప్రత్యేక అలంకారంలో, భాస్కరపేట చాముండేశ్వరి, ముత్యాలమ్మ గుడివీధిలోని ముత్యాలమ్మ, పొన్నాలమ్మ, బీపీ అగ్రహారంలోని చిన్నగంగమ్మ, పెద్దగంగమ్మ, తెట్టు నల్లగంగమ్మ ప్రత్యేక అలంకారంలో భక్తులను దీవించారు. బహదూరుపేటలోని కన్యకాపరమేశ్వరి మహాదుర్గ అలంకారంలో, ఏడుగంగల అమ్మవారు గాజుల అలంకారంలో, విశ్వబ్రాహ్మణవీధిలోని గంగమ్మ, ముత్యాలమ్మ గుడి వీధిలోని నింబజాదేవి, అష్టలక్ష్మి, పూసల వీధి గంగమ్మ, శీతాలంబ, త్రిశూలాంబ, సంతమైదానం అంకాళమ్మ, పీవీరోడ్డులోని అంకమ్మ అమ్మవార్లు విశేషాలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

వైభవంగా పార్వేట ఉత్సవం


పట్టణంలో ఊరేగుతున్న స్వామిఅమ్మవార్లు - వివిధ వేషధారణలో చిన్నారులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 13: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబ సమేత ముక్కంటీశుడికి ఘనంగా పార్వేట ఉత్సవం నిర్వహించారు. ముందుగా ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య పార్వేట ఉత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని తిలకించారు. అమ్మవారి ఊరేగింపులో వివిధ వేషధారణలో కళాకారులు అలరించారు. ఈ కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్ ఆజాద్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


వసుంధరకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో , బొజ్జల రిషితారెడ్డి

ముక్కంటి సేవలో ప్రముఖులు


జస్టిస్ జ్యోతిర్మయికి ముక్కంటి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

శ్రీకాళహస్తి, అక్టోబరు 13: జ్ఞానప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరుడిని ఆదివారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి కుటుంబ సభ్యులతో, ప్రముఖ హీరో, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర స్వామి అమ్మవార్ల సేవలో పాల్గొన్నారు. ఈవో చంద్రశేఖర్ ఆజాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితారెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆశయాలు మహోన్నతం


బృందమ్మతో మాట్లాడుతున్న మల్లికార్జుననాయుడు, రామానాయుడు

శ్రీకాళహస్తి, అక్టోబరు 13: దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆశయాలు మహోన్నత మైనవని ఎంజీఎం గ్రూప్స్ ఛైర్మన్ గుడ్లూరు మల్లికార్జున నాయుడు అన్నారు. శనివారం విజయదశమిని పురస్కరించుకుని బొజ్జల సతీమణి బృందమ్మను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంజీఎం గార్డెన్‌లోని రుద్రాక్ష పండ్ల నుంచి సేకరించి 36 రుద్రాక్షలతో తయారు చేసిన దండను బహూకరించారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆశయాలుగా మిగిలిపోయిన రెండో రింగ్‌రోడ్డు, ఎస్ఎస్‌కెనాల్ పెండింగ్ పనులు, గొడ్డేరు కాలువ తదితర పనులను బృందమ్మకు వివరించారు. గుడ్లూరు చెంచురామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై స్వామివారి చిద్విలాసం

వరదయ్యపాళెం, అక్టోబరు 13: మండలంలోని తొండంబట్టులో వేంకటేశ్వర స్వామి ఆలయంలో పెరటాసి మాసాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి గరుడవాహనంపై ఊరేగారు. మొదట ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గరుడవాహన సేవ నిర్వహించారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వ రాలయంలో శనివారం పెరటాసి మాసం ముగింపు కావడంతో కల్యాణోత్సవం జరిగింది.

వరదయ్యపాళెం: మండలంలోని అంబూరులో కొలువై ఉన్న కామాక్షమ్మ ఆలయంలో దసరా వేడుకల చివరి రోజు కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ నిర్వాహకుడు ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కేవీబీపురం : మండలంలోని ఆరె గ్రామంలో కొలువై ఉన్న బంగారమ్మ ఆలయంలో విజయదశమి సందర్భంగా లక్ష్మి, సరస్వతి, పార్వతీదేవి హోమం నిర్వహించారు. బంగారమ్మను దుర్గామాతగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ధర్మకర్త ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలతోపాటూ పసుపుకుంకుమ పంచిపెట్టారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో విజయదశమి వేడుకలను ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. పల్లమాల పచ్చాలమ్మ, నీర్పాకోట చెంగాళమ్మ, అలత్తూరులోని అంకాళమ్మ ఆలయంలో పూజలు జరిగాయి.

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మరగదాంబిక అమ్మవారు మహిషాసురమర్ధిని అలంకరణలో దర్శనమిచ్చారు. శనివారం సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలో మరగదాంబిక అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని మహిషాసురమర్ధినిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఊంజల్ సేవ నిర్వహించారు. కాగా ఈపూజా కార్యక్రమాలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఉభయదారుగా వ్యవరించారు. ఆలయ ఈవో లతా పర్యవేక్షించారు.

వేడుకగా మలయ పెరుమాళ్ ఊరేగింపు



పిచ్చాటూరు, అక్టోబరు 13: తమిళ పురటాసి 4వ శనివారాన్ని పురస్కరించుకుని పిచ్చాటూరులో శ్రీదేవి భూదేవి సమేత మలయ పెరుమాళ్ స్వామి ఊరేగింపు వేడుకగా జరిగింది. అంతకు ముందు ఉదయం ఆలయంలోని మూల విరాట్‌కు అర్చకులు ప్రత్యేక అభిషేక పూజలు చేసి వివిధ రకాల పుష్పాలు, అలంకరణలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం గోవింద భక్తుల ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. సాయంత్రం ఆలయంలోని ఉత్సవమూర్తులను అలంకరించి ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలో ఊరేగించారు.

ఏర్పేడులో మట్టి మాఫియా


ట్రాక్టర్‌లో మట్టినింపుతున్న ఎక్స్‌కవేటర్

ఏర్పేడు, అక్టోబరు 13: మండలంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. రావిళ్లవారికండ్రిగ చెరువులో కొంతమంది అక్రమార్కులు ఎక్స్‌కవేటర్ల సాయంతో మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. వడమాలపేట టీసీ అగ్రహారం, పాదిరేడు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. విజయదశమి, ఆదివారం సెలవులు రావడంతో గత రెండు రోజులుగా మట్టిని తరలించేస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్‌శాఖ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

రేణిగుంట, అక్టోబరు 13: పట్టణంలోని పాతచెక్‌పోస్టు వద్ద ఓ ఇల్లు అగ్నికి దగ్ధమైంది. ఆదివారం తెలవారుజామున జరిగిన ప్రమాదంపై బాధితుడు జయకుమార్ తెలిపిన వివరాల మేరకు... ఇంట్లో కుటుంబసభ్యులతో కలిసి నిద్రిస్తుండగా ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు వ్యాపించి వేగంగా ఇల్లు మొత్తం అలుముకున్నాయి. అప్రమత్తమైన కుటుంబీకులు వెలుపలికి వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా గృహోపకరణాలుల కాలి బూడిదయ్యాయి.

భక్తిశ్రద్ధలతో అక్కచెల్లెళ్లకు పొంగళ్లు

ఏర్పేడు, అక్టోబరు 13: మండలంలోని పలు గ్రామాల్లో అక్కచెల్లెళ్లు అయిన పోలేరమ్మ, గంగమ్మ, సత్తమ్మ, మూలస్థానమ్మ, అంకాలమ్మ అమ్మవార్లకు మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. చిందేపల్లి, అముదూరు, జంగాలపల్లి, ఏర్పేడు తదితర గ్రామాల్లో పొంగళ్లు పెట్టారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడి పూజ



పిచ్చాటూరు, అక్టోబరు 13: మండలంలోని ఓబుల్రాజు కండ్రిగలో అయ్యప్ప మహా పడి పూజ కార్యక్రమాన్ని గురుస్వామి నాగేంద్రబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. 18 మెట్లకు పూజలు చేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ఏర్పేడు, అక్టోబరు 13: పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యాసంవత్సరం టెన్త్ చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని తీర్మానించారు. హెచ్‌ఎం రాఘవయ్య, ఉపాధ్యాయులు, సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో భువనేశ్వరి తదితరులు హాజరయ్యారు.

కరాటే పోటీలలో చిన్నారుల ప్రతిభ



సత్యవేడు, అక్టోబరు 13: తమిళనాడు రాష్ట్రం ఆరణిలో ఆదివారం నిర్వహించిన డాక్టర్ అబ్దుల్ కలాం మెమోరియల్ రాష్ట్రస్థాయి ద్వితీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సత్యవేడుకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ప్రతిభ చూపారు. దళవాయి అగ్రహారం మెయిన్ స్కూల్లో చదువుతున్న రిత్విక్ యాదవ్, మాస్టర్ స్కూల్ విద్యార్థిని నజియబాను, కింగ్స్ స్కూల్ విద్యార్థిని లక్షిక ప్రథమ స్థానంలో నిలిచారు. ఉచిరై స్పోర్ట్స్ కరాటే అకాడమీ అధ్యక్షుడు శివకుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పరంధామన్ చేతుల మీదుగ ట్రోఫీలు, ప్రశంశా పత్రాలు అందుకున్నట్లు కరాటే మాస్టర్ భువనేష్ తెలిపారు.

విజయదశమి వేడుకలు



ఏర్పేడు, అక్టోబరు 13: మండలంలో విజయదశమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఛైర్మన్ గిరినాయుడు ఆధ్వర్యంలో చివరి రోజైన శనివారం రాత్రి వల్లీ దేవి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే చిందేపల్లిలో కొలువై ఉన్న పార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు, చండీ హోమాన్ని నిర్వహించారు. పార్వతీదేవికి గ్రామోత్సవం నిర్వహించారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు


పోలీసుల అదుపులో ఉన్న మునికన్నా

శ్రీకాళహస్తి, అక్టోబరు 13: ఆరేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన అంజూరు మునికన్నా (22) పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి తెలిపిన వివరాలు... తొట్టంబేడు మండలం జ్ఞానమ్మకండ్రిగ అరుంధతివాడకు చెందిన మునికన్నా భవన నిర్మాణ కార్మికుడు. గతంలో పలు నేరాల్లో నిందితుడు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి పట్టణంలోని పూసలవీధిలో తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డాడని పోలీసులు గుర్తించారు. అలాగే ఆరేళ్ల బాలిక తన మేనత్త సంరక్షణలో పెరుగుతోంది. శనివారం వీధిలో ఆడుకుంటున్న బాలికతో మునికన్నా మాటలు కలిపాడు. ఈ వీధికి సమీపంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశంలోకి బాలికను తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాలిక మేనత్త 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం యువకుడిని అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేశారు. శ్రీకాళహస్తి న్యాయస్థానంలో హాజరు పరచగా 14రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.